## క్లుప్తంగా

### రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారిణులతో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

**రావికమతం:** మండలంలో దొండపూడి గ్రామంలో శ్రీదుర్గాలమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి వాలీబాల్, రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు స్థానిక గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో 22 జట్లు, మహిళా కబడ్డీ పోటీలకు 6 జట్లు తలపడ్డాయి.

### మైనింగ్ పనులు వెంటనే ఆపాలి



ఆర్డీవో కార్యాలయం ప్రధాన గేటు ముందు బైఠాయించిన క్వారీ బాధితులు

**నర్సీపట్నం:** మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామంలోని దళితల భూముల్లో జరుగుతున్న క్వారీ మైనింగ్‌ను వెంటనే నిలుపుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అధికారులను డిమాండ్ చేశారు. నిరాహార దీక్షల్లో భాగంగా గురువారం ఆర్డీవో కార్యాలయం ప్రధాన ద్వారం ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల భూముల్లో జరుగుతున్న మైనింగ్‌ను వెంటనే ఆపాలన్నారు. క్వారీ లీజు రద్దు చేసే వరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**చీడికాడ:** మండలంలో చీడికాడ 33కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని తురువోలు ఫీడర్ పరిధిలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నర్సీపట్నం ట్రాన్స్‌కో ఆపరేషన్ ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు తురువోలు ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

### పరిమితంగానే ఎరువులు వాడాలి

**రోలుగుంట:** పంటల సాగు పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి చిరంజీవి సూచించారు. పంట సాగు పద్ధతులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని సచివాలయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తున్నట్టు గుర్తించామని, రైతులు ఎరువులు పరిమితంగా వాడి తద్వారా పంట దిగుబడులు సాధించాలని సూచించారు.

### పశువులను చెట్ల కింద కట్టొద్దు



పాడి రైతులకు సూచనలు చేస్తున్న పశువైద్యాధికారి నాయుడు

**కె.కోటపాడు :** ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సమయాల్లో పాడి రైతులు పశువులను పాకల సమీపంల్లో గల చెట్ల కింద కట్టొద్దని చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్. వై.నాయుడు చెప్పారు.. మల్లంపాలెం, పాచిలవానిపాలెం, గవరపేట ప్రాంతాల్లోని పాడి రైతులకు గురువారం పశువైద్యంతో పాటు ఆయన పలు సూచనలు చేశారు. వర్షాల సమయాల్లో లోతట్టు ప్రాంతాల్లో పశుగ్రాసం మునిగిపోయి పశువులకు గడ్డి కొరత ఉంటే పశువైద్య కేంద్రంలో రైతులు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కనకరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆఖరి శ్రావణ శుక్రవారం పూజలకు ఏర్పాట్లు



సిద్ధమైన వేంకటేశ్వర ఆలయం

**రోలుగుంట:** ఆఖరి శ్రావణ శుక్రవారం పూజలకు స్థానిక కొండపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం సిద్ధమైంది. ఇక్కడ నిర్మించిన మహాలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు. సామూహిక కుంకుమ పూజలు చేస్తామని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ముమ్మరంగా వరినాట్లు

- తాండవ నీరు విడుదలతో చురుగ్గా పనులు
- ట్రాక్టర్లు, కూలీలకు గిరాకీ



మాడుగుల: పెద్దేరు ఆయకట్టులో వరి నాట్లు వేసుకున్న దృశ్యం



నాతవరం: దమ్ము చేస్తున్న రైతు



నాతవరం: వరినాట్లు వేస్తున్న కూలీలు

**నాతవరం:** ఖరీఫ్ సాగుకు తాండవ రిజర్వాయరు నుంచి నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు పరిధిలో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. తాండవ రిజర్వాయరు నీటిపై ఆధారపడి అనకాపల్లి జిల్లా నాతవరం, కోటవురట్ల, నర్సీపట్నం, పాయకరావుపేట మండలాలతో పాటు కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రవతలపూడి మండలాల పరిధిలో 52 వేలు ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డల నుంచి ప్రవహించే నీటితో విద్యుత్ మోటార్లు ఉన్న రైతులు వరినాట్లు వేసుకున్నారు. నిమ్మకట్టు ఆనకట్టు పరిధిలో మాత్రమే రైతులు వరినాట్లు వేసుకోగా.. మిగతా ప్రాంత రైతులు తాండవ నీటిపై ఆధారపడి వరినాట్లు వేస్తుంటారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో రెండు జిల్లాల పరిధిలో తాండవ ఆయకట్టు పంట పొలాల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. రైతులంతా ఒకేసారి దమ్ము చేయడం, వరినారు తీయడం, వంటి పనులు చేపట్టడంతో ట్రాక్టర్లు, కూలీలకు ఊహించని గిరాకీ ఏర్పడింది. స్థానికంగా ఉన్న ట్రాక్టర్లు దమ్ము చేయడానికి చాలకపోవడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి కొంత మంది రైతులు ట్రాక్టర్లు తీసుకొచ్చి దమ్ము పనులు చేస్తున్నారు. వరినాట్లు వేసేందుకు కూలీల కొరత కారణంగా ఇతర ప్రాంతాల నుంచి అధిక డబ్బులు ఇచ్చి తీసుకొస్తున్నారు. ఒకప్పుడు వరినాట్లు మహిళలు మాత్రమే వేస్తుండే వారు. ఇప్పుడు మహిళా కూలీలకు గిరాకీ పెరగడంతో మగవారు సైతం వరినాట్లు పనులు చేస్తున్నారు.

**పెద్దేరు ఆయకట్టులో..**

మాడుగుల: మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం ఆయకట్టులో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. ఆయకట్టు 5 వేల ఎకరాలలో వరి నాట్లు వేయవలసి ఉండగా.. ఇప్పటికే 4 వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ప్రస్తుతం జలాశయంలో పుష్కలంగా సాగునీరు చేరడంతో పంటలు చేతికి వస్తాయని అన్నదాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

**రావికమతం:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, కనీస వేతనం రూ.26,000 చేయాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఉప తహసీల్దారుకు, ఎంపీడీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు భాగ్య, వరలక్ష్మి, సిటు మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

**నర్సీపట్నం:** తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ వెల్ఫేర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వర రావు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఆన్‌లైన్ యాప్ వల్ల అంగన్‌వాడీలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని చెప్పారు. రేయింబవళ్లు పని చేస్తున్నా మొబైల్‌ఫోన్లు సపోర్టు చేయటం లేదన్నారు. గత 42 రోజుల సమ్మెపై ప్రభుత్వం చేసిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు, ఆర్థిక ఇబ్బందుల్లో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్.గౌరి, నర్సీపట్నం, గొలుగొండ ప్రాజెక్టు నాయకులు మహాలక్ష్మి, భ్రమరాంబ, మంగ, వరలక్ష్మి, కృష్ణవేణి, పద్మజ, సత్యవతి, వసంత, పాల్గొన్నారు.

**దేవరాపల్లి:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పెరిగిన పని భారానికి తగ్గట్టుగా వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చి నేటి వరకు కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీల నిరసనకు సీపీఎం నాయకుడు డి.వెంకన్న, బి.టి.దొర మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వరలక్ష్మి, సిహెచ్.పద్మ, కాశీఅన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు కోసం మొక్కలు నాటి వినూత్న నిరసన




రోడ్డును తవ్వి మొక్కలు నాటుతున్న గిరిజనులు

**రావికమతం:** చినపాచిల నుంచి టి.అర్జాపురం, బీఎన్ రోడ్డు వరకు రోడ్డును తవ్వి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. ఈ రోడ్డు పనులను తక్షణం ప్రారంభించాలని కోరుతూ గిరిజనులు రోడ్డుపై మొక్కలు నాటి వినూత్న రీతిలో గురువారం నిరసన తెలిపారు. చినపాచిల నుంచి ఎర్రబంద, కె.గదబపాలెం, కోట్నాబిల్లి, తదితర గ్రామాలకు 2023లో 14 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణం కోసం రూ.6.98 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2024 జనవరిలో పనులు ప్రారంభించారు. 6 కిలోమీటర్ల మేర గ్రావెల్ వేసి రోలింగ్ చేశారు. మరో రెండు కిలోమీటర్ల పొడవున పి.కోట్నాబిల్లి నుంచి రామన్నదొరపాలెం వరకు రోడ్డును తవ్వేసి వదిలేశారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నిస్తే చేసిన రోడ్డు పనులకు బిల్లులు అవ్వలేదని, అందుకే పనులు నిలిపివేశామని చెబుతున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు, గిరిజన గ్రామాలు ప్రజలు పాల్గొన్నారు.

## నిండుకుండలా తాండవ

- మూడు రోజుల్లో పెరిగిన నీటిమట్టం
- గొలుగొండలో భారీ వర్షాలే కారణం



వరద నీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

**గొలుగొండ:** తాండవ జలాశయం నిండుకుండలా దర్శనమిస్తోంది. ఇటీవల మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు గొలుగొండ మండలంలో గెడ్డలు పొంగడంతో ఒక్కసారిగా నీటిమట్టం పెరిగిపోయింది. తాండవ జలాశయానికి గొలుగొండ మండలంలో దారగెడ్డ, బోరింగ్ గెడ్డ, బొడ్డేరు, గొర్రిగెడ్డలే ప్రధాన ఆధారం. వీటి నుంచి ప్రవహించే ప్రతి నీటి చుక్క తాండవ జలాశయానికి చేరుతుంది. ఆయా గెడ్డలు మండలంలో దారకొండ దిగువన ఉండడంతో ఆది, సోమవారాల్లో కురిసన వర్షాలకు ఉప్పొంగాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నాట్లు పడతాయా? లేదా? అన్న ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షాలు కలిసొచ్చాయి. మండంలో 7 వేల ఎకరాల్లో వరినాట్లు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అంతేకాకుండా తాండవ జలాశయం దిగువన ఉన్న సుమారు రెండు జిల్లాల్లో 50 వేల ఎకరాలకు ఖరీఫ్‌లో నాట్లుకు ఎటువంటి ఢోకా లేదు. గొలుగొండ మండలంలో బొడ్డేరు గెడ్డ ఉన్న విప్పలపాలెం ఆయకట్టులో 1500 ఎకరాల్లో నాట్లు జరుగుతున్నాయి. దారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, గొర్రిగెడ్డ దిగువన మరో 1800 ఎకరాల్లో నాట్లుకు ఢోకా లేదు. ప్రధానంగా రావణాపల్లి జలాశయం దిగువన గొలుగొండ, నర్సీపట్నం మండలాల్లో 1200 ఎకరాల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.

### తగ్గని ఉరకగెడ్డ ప్రవాహం



ఉధృతంగా ప్రవహిస్తున్న ఉరకగెడ్డ

**మాడుగుల:** మండలంలో శంకరం పంచాయతీ శివారు గిరి గ్రామాలైన వెలగలపాడు, కొత్తవలస, రాజంపేట, గొప్పూరు, తాళవలస, మామిడిపాలెం, తదితర గ్రామాలు ఉరకగెడ్డ దాటలేక ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలో వర్షాలు అధికం కావడంతో మండల కేంద్రానికి రావడానికి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు స్పందించి కొత్తవలస వద్ద ఉరకగెడ్డపై వంతెన నిర్మించాలని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.

## సత్వరమే మెడికల్ కాలేజీ పూర్తి చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ

**నర్సీపట్నం:** మాకవరపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీని ప్రభుత్వ సత్వరమే పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, స్థానిక పెద్దలు, ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు. అజశర్మ మాట్లాడుతూ ఏజెన్సీ ముఖ ద్వారమైన నర్సీపట్నం నియోజకవర్గం, మాకవరపాలెంలో మెడికల్ కళాశాల అవసరం చాలా ఉందన్నారు. ఈ నిర్మాణాన్ని కొనసాగించాల్సిందిపోయి ప్రభుత్వ అర్థంతరంగా నిలిపివేయడాన్ని తప్పుపట్టారు. వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్తున్న తరుణంలో ఇక్కడ కళాశాల నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వైద్య విద్యార్థులకే కాకుండా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. కళాశాల అందుబాటులోకి వస్తే మాకవరపాలెంతో పాటు నర్సీపట్నం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ లక్ష్మీకాంత్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో డాక్టర్ అజయ్ స్రవంత్, లీగల్ సెల్ సభ్యులు కె.శివనారాయణరాజు, విశ్రాంత రెవెన్యూ అధికారి కనకరాజు, జోగినాయుడు, గౌరునాయుడు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి బోరు ప్రారంభం



వడ్డాదిలో బోరును ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, నాయకులు

**బుచ్చెయ్యపేట:** వడ్డాదిలో ఎంపీటీసీ నిధులతో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి గురువారం ప్రారంభించారు. తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో రూ.లక్ష నిధులతో మోదకొండమ్మ ఆలయం వద్ద మంచినీటి బోరు ఏర్పాటు చేశామని వైస్ ఎంపీపీ తెలిపారు. బోరుకు మోటారు ఏర్పాటు చేసి అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు, గ్రామస్తులకు తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటింటి కుళాయి పనులకు సుమారు కోటి రూపాయిలకు పైగా నిధులు తీసికొచ్చామని, ఆ పనులు పూర్తయితే గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉండదన్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ, వార్డు మెంబర్లు గుమ్మిడి ప్రసాద్, అడపా వరహాలబాబు, వెలుగుల అయ్యన్నదొర, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చింతల శంకర్రావు, స్కూల్ కమిటీ చైర్మన్లు మనోహర్ నాయుడు, అప్పారావు నాయకులు సయ్యపురెడి కొండబాబు, కేబుల్ ప్రసాద్, తెప్పల నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## 737 సర్వే సరిహద్దుల పరిశీలన



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

**మాకవరపాలెం:** రాచపల్లి రెవెన్యూలోని 737 సర్వే నంబర్ భూముల సరిహద్దులను నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ గురువారం పరిశీలించారు. రాచపల్లి రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో సుమారు 1605 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దుల ఏర్పాటుకు సర్వే జరుగుతోంది. గురువారం సాయంత్రం ఆర్డీవో చినరాచపల్లి ఊటగెడ్డ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దులను పరిశీలించారు. అనంతరం ఇదే రెవెన్యూలో ఏపీఐఐసీ ఆధీనంలోని 309 ఎకరాల భూమిలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను కూడా ఆయన పర్యవేక్షించారు. పరిశ్రమల స్థాపనకు భూములు కేటాయించడంలో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఊటగెడ్డ రిజర్వాయర్‌ను పరిశీలించి ఆయకట్టు వివరాలు తెలుసుకున్నారు.

## ఘనంగా మరిడిమాంబ పండగ



బంగారుమెట్ట నుంచి అమ్మవారి వద్దకు వెళ్తున్న గ్రామస్తులు



ఏఎల్‌పురంలో అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



జానకిరాంపురంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నాతవరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**బుచ్చెయ్యపేట:** మండలంలోని బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల దేవత మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లో వెలిసిన మరిడిమాంబ అమ్మవారి గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. భారీ మందుగుండు సామగ్రి కాల్చి, నేల డాన్సలు, డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఏడాదిలో వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా చల్లని దీవెనలు అందించాలంటూ మరిడిమాంబను వేడుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద వేపచెట్టుకు ముడుపులు కట్టి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

**మాకవరపాలెం:** మండలంలోని పి.పి.అగ్రహారం, బి.ఎస్.పేట గ్రామాల్లో గురువారం మరిడమ్మ పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పండగలో స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**గొలుగొండ:** మండలంలో ఏఎల్‌పురం గ్రామంలో మరిడితల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం కోసం బారులు తీరారు. రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**మరిడమ్మ ఆలయం ప్రారంభం**

రోలుగుంట: జానకిరాంపురంలో ఇటీవల నిర్మించిన మరిడమ్మ ఆలయాన్ని గురువారం ఉదయం 4 గంటల సమయంలో ప్రారంభించారు. అనంతరం అమ్మవారి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ లగుడు కృష్ణంనాయుడు దంపతులు, కుటుంబంతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**నాతవరం:** మండల కేంద్రం నాతవరంలో మరిడిమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు నాతవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అపిరెడ్డి మాణిక్యం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. మర్రిపాలెం, వై.బి.పట్నం, రామచంద్రపురం, అగ్రహారం, వి.బి.అగ్రహారం, ఎం.బి.పట్నం, తదితర గ్రామాల్లో కూడా అమ్మవారి పండగ జరిగింది.

### వేతనాలు పెంచాలని నైట్ వాచ్‌మన్ల వినతి

**నర్సీపట్నం:** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న నైట్ వాచ్‌మన్లు వేతనాలు పెంచాలని కోరుతూ గురువారం దొండపూడి విచ్చేసిన ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు వినతిపత్రం అందజేశారు. గౌరవ వేతనం చాలా తక్కువగా వస్తుందని, కనీస వేతనం ఇప్పించాలని కోరారు. ప్రభుత్వంతో మాట్లాడి కనీస వేతనం వచ్చేటట్లు కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారని వాచ్‌మన్ల సంఘం జిల్లా ప్రెసిడెంట్ బొర్రా చంటిబాబు తెలిపారు.

## దోమల నివారణకు చర్యలు అవసరం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శశి ప్రియాంక

**కె.కోటపాడు :** దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శశి ప్రియాంక సూచించారు. ఎ.కోడూరు శివారు కొత్తూరు గ్రామంలో గురువారం సంచార వైద్య చికిత్స కార్యక్రమంలో భాగంగా 168 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య తనిఖీలతో పాటు షుగర్ పరీక్షలు చేశారు. ఇంటి పరిసరాల్లో వారం రోజులకు పైబడి ఉన్న నిల్వ నీటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హిక్సయా, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఏఎస్ఎం గోవింద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి



డీఎస్పీ శ్రీనివాసరావు

**నర్సీపట్నం:** వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండపాలు ఏర్పాటు చేసే వాళ్లు ఆన్‌లైన్లో పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులకు పైసా ఖర్చు అవసరం లేదన్నారు. డీజే సౌండ్ సిస్టం రాత్రి పది తర్వాత వినియోగించరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మద్యం తాగి వేడుకల్లో పాల్గొనవద్దని, అశాంతి కలిగించే నినాదాలు, పాటలు పూర్తిగా నిషేధిస్తున్నట్లు వెల్లడించారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో క్రమశిక్షణ పాటించి, పోలీసులు సూచించిన మార్గాలనే ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల కమిటీ సభ్యులు అనుమతి కోసం పోలీస్ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు.